## క్లుప్తంగా

### నేడు గురు పౌర్ణమి ప్రత్యేక పూజలు

**సుభాష్‌నగర్:** గురు పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం గాజులరామారం మహదేవపురంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 4గంటలకు కాగడ హారతి, 5 గంటలకు పంచామృతాభిషేకం, 6 గంటలకు విఘ్నేశ్వరుని పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మండపారాధన, లక్ష్మీగణపతి హవనం, నవగ్రహ హవనం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదానం, రాత్రి 7గంటలకు పల్లకి సేవ, రాత్రి 9గంటలకు శేషహరతి కార్యక్రమాలుంటాయని పేర్కొంది.

### బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

**సుభాష్‌నగర్:** వసంత గ్రూప్, ఏషియన్ స్పైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం జీడిమెట్ల గ్రామంలోని డెకత్లాన్ వద్ద 5కే రన్‌ను నిర్వహించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి పిల్లలకు బంగారు భవిష్యత్‌ను అందించే సదుద్దేశంతో ఈ రన్‌ను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. జీడిమెట్ల గ్రామం నుంచి ప్రారంభమైన ఈ రన్ సుచిత్ర వరకు కొనసాగి తిరిగి డెకత్లాన్ వద్ద ముగిసింది. ఈ రన్‌లో చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు.

### ఎంచుకున్న రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**దుండిగల్:** విద్యార్థులు పట్టుదలతో వారు ఎంచుకున్న రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ప్రగతినగర్‌లోని వంగవీటి మోహన రంగా విగ్రహ కమిటీ, వెల్ఫేర్ కమిటీల ఆధ్వర్యంలో జావా క్లాస్ రూమ్ లో రెండు రోజుల పాటు ఉచిత ట్రైనింగ్ నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకి సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. అదే విధంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్ రాజును కలిసి పలు సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

### ఎంఎల్ఆర్ఐటీలో చారిటీ మ్యాచ్

**దుండిగల్:** దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో డాక్టర్ అబ్దుల్ కలాం చారిటీ క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించారు. బోర్డ్ ఆఫ్ డిజేబుల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎలెవన్ వర్సెస్ రాజబహాదూర్ వెంకట్రామి రెడ్డి ఉమెన్స్ కాలేజ్ ఎలెవన్ జట్ల మధ్య 20–20 క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఈ పోటీని ఎంఎల్ఆర్ఐటి కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డితో కలిసి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్ ప్రారంభించారు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన మహిళా జట్టు 20ఓవర్లలో 95/7 పరుగులు చేసింది. భారత వికలాంగుల క్రికెట్ జట్టు 11 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

### మహిళ అదృశ్యం


సునీత (ఫైల్)

**జగద్గిరిగుట్ట:** భర్తతో గొడవ పడిన ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌కు చెందిన భద్రచలం, నీరజ (25)లు భార్యాభర్తలు. ఈనెల 1వ తేదీ ఉదయం 11గంటలకు భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఆమె రాత్రైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం భద్రాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### రూ.15లక్షలు విలువ చేసే బంగారం రికవరీ

**నిజాంపేట్:** పని చేస్తున్న ఇంట్లోనే సొత్తు కాజేసిన మహిళ నుంచి బాచుపల్లి పోలీసులు రూ.15లక్షలు విలువ చేసే బంగారు, డైమండ్ ఆభరణాలను రికవరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి గ్రీన్ ఎవెన్యూ విల్లాస్‌లోని విల్లా నం.114లో బీవీవీ సత్యనారాయణ కుటుంబం నివాసముంటోంది. సదరు విల్లాలో కేపీహెచ్‌బీ కాలనీ గోపాల్ నగర్‌లోని గుడిసెల్లో నివాసముండే వెంకటలక్ష్మి (38) పని చేస్తోంది. కాగా అనారోగ్యం కారణంగా సత్యనారాయణ కుటుంబం గత నెల 24వ తేదీన తూర్పు గోదావరి జిల్లాలోని తమ సొంత ఊరుకు వెళ్లారు.

◆ ఈ నేపథ్యంలో విల్లా తాళం చెవిని వెంకటలక్ష్మికి ఇచ్చి ప్రతిరోజు విల్లాను ఊడ్చడంతో పాటు మొక్కలను నీళ్లు పోయాల్సింది చెప్పారు. అయితే అప్పులతో సతమతమవుతున్న వెంకటలక్ష్మి విల్లాలోని డ్రాలో ఉంచిన రూ.15 లక్షలు విలువ చేసే రెండు బంగారు డైమండ్ గాజులు (39 గ్రా), రామ్ పరివార్ నెక్లెస్, చెవికమ్మలు (27గ్రా), రోజ్‌గోల్డ్ నక్లెస్, చెవికమ్మలు (27 గ్రా) దొంగిలించింది. ఇటీవల స్వగ్రామం నుంచి బాచుపల్లికి వచ్చిన సత్యనారాయణ కుటుంబం డ్రాలో ఉంచిన బంగారు ఆభరణాలు మాయం కావడంతో వెంకటలక్ష్మిపై అనుమానంతో బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆమెను తమదైన శైలిలో విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించింది. ఆదివారం సదరు సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితురాలు వెంకటలక్ష్మిని రిమాండ్‌కు తరలించారు.

# ఆ నిర్మాణాలను కాపాడేందుకే.!

- మరో కృత్రిమ కట్టు కాలువ ఏర్పాటు
- గాజులరామారం కట్టు కాలువ కబ్జాపై ఇప్పటికే గ్రీన్ ట్రిబ్యునల్ విచారణ


గతంలో ఉన్న కట్టు కాలువపై నిర్మాణాలు ఏర్పడి ప్రస్తుతం ఓక్షిత్ ఎంక్లేవ్ రోడ్ నం.2


కట్టు కాలువపై వెలిసిన నిర్మాణాలను కాపాడేందుకు ఆరు నెలల క్రితం వేసిన నూతన సీసీరోడ్డు పగలగొట్టి వేరే చోటు నుంచి నాలా పనులు

**సుభాష్‌నగర్:** అబద్ధాన్ని కప్పిపుచ్చుకోవడానికి, మరో అబద్ధాన్ని తెరలేపినట్టు ఉంది. అనడానికి కబ్జాకు గురైన గాజులరామారం కట్టు కాలువను నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గాజుల రామారం చెరువు దిగువ భాగాన పలు కాలనీలు వెలిశాయి. దీంతో పాటు స్థలం ధరలు అమాంతం పెరిగాయి. ఇంకేముంది కబ్జాదారులు 30 ఫీట్ల కట్టు కాలువను సైతం వదలలేరు. కట్టు కాల్వను పుడ్చేసి చేసి ప్లాట్లుగా చేశారు. తెలియని అమాయకులకు లక్షలకు విక్రయించి. కోట్లను గడించారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు రోజుల తరబడి ఆ కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో మీరు చేసిన మోసం బట్టబయలైంది. అప్పట్లో కట్టు కాలువ కబ్జా విషయం హాట్ టాపిక్ గా మారింది. ప్రస్తుతం ఆకట్టు కాలువపై నిర్మాణం కాపాడేందుకు మరో చోటు నుండి నాల పనులను ప్రారంభించారు.

**రామారం పెద్ద చెరువు..**

సూరారం గ్రామాన్ని అనుకుని ఉన్న రామారం పెద్ద చెరువు సర్వే నంబర్ 70, 71 లో కలుపుకొని 24.22 ఎకరాలలో విస్తరించి ఉంది. ఈ చెరువు ఎగువ ప్రాంతమైన లింగా చెరువు, కొత్తచెరువు, ఎర్ర చెరువు, మార్నింగ్ ఓంపులోని నీరు రామాలయం చెరువులో వచ్చి చేరుతుంది. పైనున్న చెరువులు అలుగు పారినప్పుడు ఈ చెరువు అలుగు ఉధృతంగా ప్రవహిస్తుంది. చెరువు దిగువ భాగాన ఓక్షిత్ ఎన్‌క్లేవ్ తో పాటు ఇతర కాలనీలో వెలిశాయి. ఈ చెరువు పాడినప్పుడు సర్వే నంబర్లు 91, 92, 100, 101, 106, 121, 122, 137, 136, 132, 147, 180, 175, 183, 184, 170 ల గుండా కట్టు కాలువ వెళ్ళేది. కొంతమంది కళ్లు దీనిపై పడడంతో కట్టుకోవాలని పూజ చేసి ప్లాట్లుగా చేసి లక్షల్లో విక్రయించారు. ప్రస్తుతం కట్టు కాలువపై నిర్మాణాలు వెళ్లడంతో పూర్తి ఆనవాళ్లు కోల్పోయింది.

**గతేడాదిలో కురిసిన భారీ వర్షాలకు జలదిగ్బంధంలో...**

గతేడాది కురిసిన భారీ వర్షాలకు, కట్టు కాలువ కబ్జాతో దిగువ ప్రాంతానికి వరద నీరు వెళ్లేందుకు మార్గం లేక, ఓక్షిత్ ఎన్‌క్లేవ్ నెలల పాటు జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో చాలామంది నిద్రాహారాలు మాని బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీశారు. చాలామంది తమ ఇళ్లను ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు తరలి వెళ్లారు. ఎక్కడ చూసినా టూలేట్, ఫ్లాట్ ఫర్ సేల్ బోర్డులే దర్శనమిచ్చాయి.

**కట్టు కాలువ కబ్జా పై గ్రీన్ ట్రిబ్యునల్ పలుమార్లు విచారణ..**

కట్టు కాలువ కబ్జాపై గాజుల రామారం కు చెందిన వ్యక్తి గతేడాది మార్చి నెలలో గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఇప్పటికి ఆరు శాఖల ఉన్నత అధికారుల బృందం 7 సార్లు పరిశీలించారు. ఈ విషయమై ఏ శాఖ అధికారులు సొంతగా కౌంటర్ ఇవ్వలేదు. ఇప్పటికి 15 నెలలు గడుస్తున్న అధికారులు నాన్ చూడు ధోరణి అవలంభిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఆ నిర్మాణాలు కాపాడేందుకు.. కొత్త నాలా నిర్మాణం తెరలేపి...**

గతంలో ఉన్న కట్టు కాల్వ పై నిర్మాణాలను కాపాడేందుకు రోడ్డు గుండా ఆగ మేఘాల మీద చిన్న పాటి పైప్‌లైన్ వేశారు. భారీ వర్షం దాటికి వారి ప్లాన్ బెడ్స్ కొట్టింది. ఆ నీటి ఉధృతికి పైప్‌లైన్ ఏమేరా సరిపోకపోవడంతో వరద నీరు కాలనీని ముంచేసింది. ప్రస్తుతం అలా కావద్దని, కబ్జాదారులు మరో ఎత్తుగడవేసి వేరే చోటు నుంచి నాలా పనులకు తెరలేపారు. ఓక్షిత్ ఎన్‌క్లేవ్- 2, వీనస్ ఎన్‌క్లేవ్, లాల్ సాహెబ్‌గూడలకు వెళ్లే మార్గంలో 6 నెలల క్రితం వేసిన నూతన సీసీ రోడ్డును పగలగొట్టి నిబంధన తుంగలో తొక్కి మరో నాలాను నిర్మిస్తున్నారు.

**గుర్తించింది 274, మార్కేసింది 24 మాత్రమే..**

కట్టుకలువపై 274 నిర్మాణాలు చేపట్టారంటూ జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ గుర్తించింది. కానీ కేవలం 24 మాత్రమే నిర్మాణాలు చేపట్టారు అంటూ మార్కింగ్ వేశారు. ఆ నిర్మాణాలపై ఇప్పటి వరకు కూడా చర్యలు తీసుకోలేకపోయారు.



కట్టు కాలువ కబ్జాతో గత ఏడాది జలదిగ్బంధంలో ఓక్షిత్ ఎన్‌క్లేవ్ (ఫైల్)


గత ఏడాది వర్షాకాలంలో కాలనీవాసుల నీటి యుద్ధం


గత ఏడాది మార్చిలో కబ్జాకు గురైన కట్టు కాలువను పరిశీలిస్తున్న గ్రీన్ ట్రిబ్యునల్ బృందం

## విద్యార్థులు సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలి


విద్యార్థులను సన్మానిస్తున్న సజ్జనార్

**జీడిమెట్ల:** విద్యార్థులు సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని టీఎస్ఆర్‌టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. ఆదివారం జీడిమెట్లలోని శ్రీసోమ వంశీయ సహస్రార్జున క్షత్రియ ప్రాంతీయ సమాజ్ భవనంలో చదువులో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల కోసం ఇన్స్పిరేషన్–2023 పేరిట కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమానికి సజ్జనార్, క్షత్రియ సమితి అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 107మంది విద్యార్థులను సత్కరించారు. ఈసందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ..విద్యార్థులు చదువులో పడి ఆటలకు దూరం కావొద్దని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడియా ద్వారా విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. క్షత్రియ సమాజ్ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టంకు విష్ణు, కన్వీనర్ సిరిగిరి రాంకిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

### కేవీఆర్ వ్యాలీలో కౌన్సిలర్ పర్యటన

**దుండిగల్:** వార్డు అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపెట్ 26వ వార్డు కేవీఆర్ వ్యాలీలో ఆదివారం ఆయన పర్యటించారు. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు, రోడ్లు, మంచి నీరు తదితర సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. అ కార్యక్రమంలో సీనియర్ నాయకలు బుచ్చిరెడ్డి, శామీర్‌పేట హనుమంత్‌రావు, పాక్స్ డైరెక్టర్ అర్కల జీతయ్య, శామీర్‌పేట రంగయ్య, మాజీ వార్డు సభ్యులు బాలకృష్ణ, నాయకులు పద్మాప్రసాద్, ప్రకాష్ రావు, జకీర్, హరీష్, మోర హరీష్, కాలనీ ప్రెసిడెంట్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

## జన గర్జన సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


ఖమ్మం సభకు తరలి వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

**దుండిగల్:** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఖమ్మంలో నిర్వహించే తెలంగాణ జన గర్జన సభకు ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని అన్నారు. సభకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వాహనాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, మిద్దెల యాదిరెడ్డి, పోచి మహేష్, విజయ్‌గౌడ్, పరశురాంగౌడ్, సురేష్, మాధవరెడ్డి తదితరులు ఖమ్మంకు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

**ఎన్నికల హామీలు నెరవేర్చడంలో విఫలం**

**జగద్గిరిగుట్ట:** ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. జగద్గిరిగుట్ట వాంబేకాలనీకి చెందిన మురళి, శ్యామ్, ప్రకాశ్, శేఖర్, సాయిరామ్, బాలరాజుల ఆధ్వర్యంలో కాలనీవాసులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇంటి పథకం కింద రూ.5లక్షలు, రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిగౌడ్, వరమ్మ మెంబెర్ గణేష్, శ్రీనివాసాచారి, నరేందర్, వీరారెడ్డి, మాధవరెడ్డి, కళ్యాణ్‌గౌడ్, వేణుగౌడ్, కౌసల్య, కమల తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి లక్ష్మీనరసింహస్వామికి కిలో బంగారం సమర్పణ




**రంగారెడ్డినగర్:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కిలో బంగారం సమర్పించి తన మొక్కును చెల్లించుకున్నారు. ఆదివారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మాధవరం కృష్ణారావులతో కలిసి వివేకానంద్ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి మొక్కుకున్న కిలో బంగారానికి సరిపడా నగదును ఆలయ అర్చకులు, అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చరనలతో ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. ఆలయ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**నిజాంపేట్:** బాచుపల్లి చౌరస్తాలో ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని బాచుపల్లి సెక్షన్ విద్యుత్ ఏఈ శాంతాకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ ఏసీ టైర్, 11కేవీ మల్లంపేట్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రెయిన్‌బో కాలనీ, ప్రణీత్ జెనీత్, ఇందిరానగర్ నుంచి బాచుపల్లి సిగ్నల్ వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### నేడు కలెక్టరేట్ వద్ద మహా ధర్నా

**రంగారెడ్డినగర్:** తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం తలపెట్టిన కలెక్టరేట్‌ల మహా ధర్నాను విజయవంతం చేయాలని కుత్బుల్లాపూర్ మండల సీఐటీయూ కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ కోరారు. ఆదివారం షాపూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 20 రోజులుగా పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం మండల రెవెన్యూ కేంద్రాల వద్ద ధర్నాలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సోమవారం ఉదయం 10గంటలకు మేడ్చల్ కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాకు కుత్బుల్లాపూర్‌లోని పేదలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

## ఎట్టకేలకు భూగర్భ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



గాయత్రినగర్‌లో మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేస్తున్న జలమండలి సిబ్బంది

**చింతల్:** కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ సుచిత్ర సెక్షన్ పరిధిలోని గాయత్రినగర్‌లో ఇటీవల చోటు చేసుకున్న భూగర్భ డ్రైనేజీ సమస్యకు ఆదివారం పరిష్కారం లభించింది. గోనె, సిమెంట్ సంచులు, ప్లాస్టిక్ డబ్బాలు పైపులైన్‌లో వేయడంతో మురుగు ప్రవాహానికి పెద్ద అడ్డంకిగా మారింది. గోదావరి హోమ్స్, గాయత్రినగర్‌లలో 600 ఎంఎం డయా గల భూగర్భ డ్రైనేజీ పైపులైన్ ఉంది. ఇక్కడ మూడు రోజుల క్రితం పైపులైన్ జామై నీరంతా రోడ్లపై పారుతుండటంతో స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడు రోజులుగా అధికార సిబ్బంది మొత్తం ఇక్కడే ఉండి ఆదివారం మధ్యాహ్నం వరకు సమస్యకు పరిష్కారాన్ని కనుగొన్నారు. పైప్‌లైన్‌లో గోనె సంచులు, సిమెంట్ సంచులు దర్శనంతో అధికారులు కంగుతిన్నారు. సోమవారం పైప్‌లైన్‌లో ఇరుకున్న సంచులు, డబ్బాలను తొలగించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

### ప్రగతినగర్ నుంచి జేఎన్‌టీయూ వరకు

# ఫ్లైఓవర్ నిర్మాణ హామీ ఏమైంది.?

- బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్
- మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్
- నిజాంపేట్ కార్పొరేషన్‌ను చెత్తకుప్పగా మారుస్తున్నారని వ్యాఖ్య
- వర్షాకాలం వచ్చినా నాలాల్లో పూడిక తీయలేదని ఆగ్రహం


ప్రగతినగర్‌లో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకులు

**నిజాంపేట్:** మోసపూరిత హామీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా సమాధి కట్టాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ప్రగతినగర్ బతుకమ్మ ఘాట్ నుంచి హెచ్ఎంటీ సిగ్నల్ వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2018 సంవత్సరంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రి కేటీఆర్ ప్రగతినగర్ నుంచి జేఎన్‌టీయూ వరకు ఫ్లైఓవర్‌తో పాటు 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం, బాచుపల్లి నుంచి నిజాంపేట్ వరకు రేడియల్ రోడ్డును నిర్మిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ప్రగతినగర్ అంబీర్ చెరువును సుందరీకరిస్తామన్న ఎమ్మెల్యే ఎన్ని నిధులు విడుదల చేశారో చెప్పాలన్నారు.

**ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు భూకబ్జాదారుల అవత్తారమెత్తారు..**

◆ ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు భూకబ్జాదారుల అవత్తారమెత్తారని ఎద్దేవా చేశారు. నిజాంపేట్ కార్పొరేషన్‌ను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చెత్త కుప్పగా మారుస్తున్నారని ఆరోపించారు. వర్షాకాలం వచ్చినా నాలాల్లో పూడిక తీయలేదన్నారు. వరదనీటితో లోతట్టు ప్రాంతాలు జలమయమై స్థానికులు ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులకు పట్టడం లేదని విమర్శించారు. మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

◆ ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా.ఎస్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ మోర్చా మహిళా ప్రముఖ అమలేశ్వరి, రాష్ట్ర ఎస్సీ మోర్చా జయింట్ కన్వీనర్ దాసి నాగరాజు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రామచంద్రనాయక్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కాశి తదితరులు పాల్గొన్నారు. నాయకులు భిక్షపతియాదవ్, నరేంద్ర, సత్యనారాయణ, శేషారావు, అజయ్‌కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

## నాగులూరుకు సరైన రోడ్డు మార్గం లేదు

**రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి**

**దుండిగల్:** కేంద్ర ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశలో పయనిస్తోందని రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అన్నారు. బీజేపీ ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆదివారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి నాగులూరులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్రం ప్రభుత్వం తెలంగాణాకు ఎన్ని నిధులు కేటాయించారో వివరించారు. బీజేపీని బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

◆ బీఆర్ఎస్ ప్రభుత్వం బస్సు, విద్యుత్ చార్జీలను పెంచి తెలంగాణ ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపిందని విమర్శించారు. నాగులూరు గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడం సిగ్గుచేటన్నారు. రేషన్ సరుకులు తీసుకునేందుకు ప్రజలు సుదూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. వచ్చే తమ ప్రభుత్వ హయాంలో ప్రజల కష్టాలు తీరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌రావు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, దుండిగల్ మున్సిపల్ బీజేవైఎం అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.